క్లుప్తంగా

కృష్ణారావుకు నివాళులర్పించిన శిద్దా



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తన సోదరుడు శిద్దా వెంకట కృష్ణారావుకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలో శిద్దా వెంకట కృష్ణారావు వైకుంఠ సమారాధనలో శిద్దా రాఘవరావుతో పాటు వెంకట కృష్ణారావు కుమారులు, శిద్దా కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

బీజేపీ సమన్వయ కమిటీ నియామకం

ఒంగోలు సెంట్రల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, పెద్దల ఆదేశాల మేరకు పార్టీ సమన్వయ కమిటీ నియామకం జరిగినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పీవీ శివారెడ్డి తెలిపారు. కమిటీలో పార్లమెంటు అధ్యక్షుడు పీవీ శివారెడ్డితో పాటు పార్లమెంటు కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్, కో కన్వీనర్ ఐ.సీతారామయ్య ఉన్నారు.

అద్భుతంగా నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: నాట్య గురువు, హెచ్ఆర్‌పీసీ ఆంధ్రప్రదేశ్ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీశ్వేత ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక రవిప్రియ మాల్ ఆవరణలో జరిగిన చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. సంప్రదాయ భక్తిగీతాలకు చిన్నారులు హావభావాలు, విన్యాసాలతో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. దేవతా పాత్రలలో చక్కగా అలరించారు. కార్యక్రమంలో మువ్వల అభిషేక్త, కీర్తి, దుర్గ శ్రీలక్ష్మి, ప్రియదర్శిని, చిన్నారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందిస్తే రాణింపు

ఒంగోలు సెంట్రల్: పశువైద్య సహాయకులు క్షేత్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందిస్తే గుర్తింపు పొంది వృత్తిలో రాణిస్తారని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కే బేబిరాణి అన్నారు. డీఎల్‌డీఏ మీటింగ్ సమావేశపు మందిరంలో సోమవారం 45 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన పశువైద్య సహాయకులు (ఏహెచ్‌ఏ) శిక్షణలో పూర్తిస్థాయి దృష్టి సారించి నేర్చుకోవాలని కోరారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలు క్షేత్ర స్థాయిలో పశువులకు సేవలు అందించేందుకు చక్కగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఒంగోలు డివిజన్, బాపట్ల జిల్లాలోని రెండు పశువైద్యశాలలకు చెందిన 62, మార్కాపురం డివిజన్ పరిధిలో 46 మంది మొత్తం 108 మందికి 45 రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణకు సంబంధించిన కరదీపికలు పంపిణీ చేశారు. కార్యనిర్వహణాధికారి, డీఎల్‌డీఏ డాక్టర్ షేక్ కాలేషా, ఒంగోలు డివిజన్ అధికారి డాక్టర్ రమేష్ బాబు, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ బసవ శంకరరావు, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ సాహితీ, డాక్టర్ అనిల్, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

అవ్వాతాతలపై టీడీపీ కుట్ర

- వలంటీర్ల ద్వారా పెన్షన్లు అందకుండా కోర్టుల్లో కేసులు
- ఎవరి వల్ల మేలు జరిగిందో మీరే నిర్ణయించుకోండి
- కోర్టులో కేసులు వేసినా కేవలం రెండు నెలలే..
- ఆ తర్వాత మళ్లీ మీ ఇంటికే పెన్షన్లు
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలు రాంనగర్‌లో వైఎస్సార్ సీపీలో చేరిన 50 కుటుంబాలకు కండువాలు కప్పి స్వాగతం



వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్న టీడీపీ.. చివరకు అవ్వాతాతలపై కూడా కుట్రకు పాల్పడిందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక రాంనగర్ 6వ లైన్‌లో దొంతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీలో చేరికల కార్యక్రమానికి బాలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు యరజర్ల వద్ద ఇళ్లపట్టాలు ఇస్తామంటే కోర్టులో కేసు, భూమి కొనుగోలు చేసి ఇళ్లపట్టాలు ఇస్తే దానిపై మళ్లీ కేసు, ఒకటేమిటి రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధికి టీడీపీ ఆటంకంగా మారిందన్నారు. అయినాసరే ఇచ్చిన మాటకు కట్టుబడి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, తనను గెలిపిస్తే మరో 9 నెలల్లో ఇళ్లు కూడా కట్టించి ఇస్తామని అన్నారు. నిన్నటివరకు ఇంటి వద్దనే ఉదయాన్నే పెన్షన్ పొందుతున్న వృద్ధుల మొహాల్లో చిరునవ్వు కనిపించడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోయారని, దీంతో ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని వలంటీర్లపై విషం చిమ్ముతూ అవ్వాతాతల పెన్షన్ల పంపిణీపై కూడా ఆంక్షలు తీసుకువచ్చారని అన్నారు. వారి ఉద్దేశం అంతా పెత్తందార్ల మాదిరిగానే ఉంటుందని, వారి ముందు క్యూలో నిలబడితేనే పెన్షన్లు ఇవ్వాలనేది వారి ఆరాటమని విమర్శించారు. కానీ, మన ప్రభుత్వం మాత్రం పెన్షన్ అనేది వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులు, మంచంలో ఉన్నవారు సైతం ఆనందంగా, ఆత్మగౌరవంతో అందుకునేలా ఉండాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి వారినే పెన్షనర్ ఇంటికి పంపించి మరీ అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు పాలన పెత్తందారీ వ్యవస్థను గుర్తుకు తెస్తుంటే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మీ బిడ్డ మాదిరి ప్రభుత్వాన్ని గుర్తుకు తెస్తుందన్నారు. ప్రభుత్వం అంటే ప్రజలకు సంక్షేమం అందించడం, వారికి సంతోషం కలిగించడం అని పేర్కొన్నారు. కానీ, టీడీపీ మాత్రం ఎవరు ఎటుపోయినా పర్లేదు.. ప్రతి అంశంలోనూ రాజకీయం ఉండాల్సిందేననే ధోరణిలో ఉందని, వారికి చెక్ పెట్టాలంటే ప్రతి లబ్ధిదారు జగనన్న స్టార్ క్యాంపెయినర్‌గా మారి రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని బాలినేని కోరారు. చంద్రబాబు మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తుంటే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుందంటారు, కానీ.. ఆయనకు అధికారం వస్తే మాత్రం రెట్టింపు సంక్షేమ పథకాలు చేస్తానంటూ ఆయనకు ఉన్న గందరగోళాన్ని ప్రజల మీదకు నెట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. కానీ, ప్రజలు నేడు చైతన్యవంతం అయ్యారని, తప్పకుండా వారు విశ్వాసాన్ని ప్రదర్శించి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటారని తెలిపారు. చంద్రబాబు హామీలు ఇవ్వడం అంటే.. అవి కేవలం ఒట్టిమాటలే అని, అవి అమలుపరిచేవి కావంటూ మహిళలు పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా మహిళలు సైతం టీడీపీకి రాం రాం అంటున్నారంటే ఆ పార్టీ పరిస్థితి ఏమిటో తెలుసుకోవచ్చన్నారు. దొంతు శ్రీనివాస్ తన గెలుపునకు చేస్తున్న కృషిని ఎన్నడూ మరువలేనని, ఆయన రెండో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారంటే పార్టీ గెలవాలని ఆయనలో ఉన్న తపనకు నిదర్శనమని బాలినేని అభినందించారు. తప్పకుండా శ్రీనుతోపాటు అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీని నమ్ముకున్న మహిళలు కూడా వామ్మో చంద్రబాబు అనే పరిస్థితి నేడు నెలకొందని, గత ప్రభుత్వ సమయంలో డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామంటూ వారిని ఎంతగా మోసగించింది అందరికీ తెలుసని అన్నారు. ఈ సందర్భంగా దొంతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన 50 కుటుంబాలకు బాలినేని స్వయంగా వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో వాసిపోగు దాసు, అన్నపురెడ్డి బాబు, షేక్ వలి, లాయర్ సురేష్, వనజ, దివ్య, లక్ష్మి, మణికంఠ, నూర్జహాన్, అనీల్‌కుమార్‌రెడ్డి, మధు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, గంటా రామానాయుడు, కార్పొరేటర్ నాగభూషణం, మీరావలి, మధు, రావూరి బుజ్జి, గోపి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించాలి



ఇనమనమెళ్లూరులో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతిస్తున్న మంత్రి మేరుగు

- మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: వైఎస్సార్ సీపీని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున కోరారు. సోమవారం మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతిగా నిలిచిన ప్రభుత్వాన్ని మరోమారు గెలిపించుకోవాలని, అందుకోసం ప్రతిఒక్క కార్యకర్త తమవంతు కృషి చేయాలని కోరారు. ప్రజల బాగోగులు చూసే వాడే ముఖ్యమంత్రి స్థానానికి అర్హులవుతారని, అది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. దళితులంటే ఛీత్కరించుకుని వారిని కించపరిచేలా మాట్లాడుతున్న చంద్రబాబు మనకు కావాలా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో పేద, బడుగు, బలహీనవర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని, ఆయన పలు పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ మేలు చేశారని చెప్పారు. రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనం నాటిన దగ్గర నుంచి పంట కొనుగోలు చేసేంత వరకూ భరోసా కల్పిస్తున్నారని అన్నారు. కులవృత్తుల వారికి పది వేల రూపాయలు అందిస్తున్నారని, మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా పలు ప్రయోజనాలు చేకూర్చారని తెలిపారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని ఆయన కోరారు. ఒక్కసారి ముఖ్యమంత్రిని చేస్తేనే ఎన్నో ప్రయోజనాలు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ప్రజలకు అందాయని మంత్రి వివరించారు. మేలు జరిగితేనే నాకు ఓటు వేయండని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన కాకుండా ఇంకెవరైనా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు ఎమ్మెల్యే సీటు ఇస్తే టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చాడంటూ అవహేళనగా మాట్లాడావు, నీవు డబ్బు లేని వారికి ఒక్కరికైనా సీటు ఇచ్చావా అంటూ చంద్రబాబును ప్రశ్నించారు. సీటు కావాలంటే కోట్లు దండుకుంటూ పబ్బం గడుపుకునే బాబుకు వచ్చే ఎన్నికలలో గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 45 సంవత్సరాలు ఇండస్ట్రీ, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు.. ప్రజలకు చేసిన మేలు ఒక్కటైనా చెప్పి ఓట్లు అడగగలడా అంటూ సూటిగా ప్రశ్నించారు. పక్కపార్టీల పథకాలు కాపీ కొట్టి ఆరు వాగ్దానాలు అంటూ ఓట్లు అడగడానికి ఏ ముఖం పెట్టుకుని ప్రజల మధ్యకు వస్తావంటూ ప్రశ్నించారు. కేసుల భయంతో బీజేపీ నాయకుల వద్ద సాగిలపడి వారి పొత్తు కోసం పాకులాడిన చంద్రబాబు.. ఆ పార్టీల వారిని కూడా మోసం చేశాడన్నారు. ముందుగానే తమ పార్టీ నుంచి బీజేపీలోకి, జనసేనలోకి చేరిన నాయకులకు టికెట్లు వచ్చేలా కుయుక్తి ప్రదర్శించాడని, దాని ఫలితంగానే కూటమి కుతకుత ఉడికిపోతుందని అన్నారు. చంద్రబాబుకు రాష్ట్రంలో ఇవే చివరి ఎన్నికలని, 2019లో కేవలం 23 సీట్లు మాత్రమే ఇచ్చిన ప్రజలు ఈసారి పూర్తిగా బోడిగుండు చేసి బంగాళాఖాతంలో విసిరేస్తారని మేరుగు నాగార్జున ఎద్దేవా చేశారు. నియోజవర్గానికి కొత్తవాడినైనా తనను పూర్తిగా ఆదరించి వెన్నంటి నిలుస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, మంత్రి కుమారుడు చందన్ నాగ్, పార్టీ సీనియర్ నాయకులు మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, మజీద్, పిట్టల ఆంజనేయులు, తేళ్ల పుల్లారావు, నలమలపు కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు మేరుగు పద్మ, పల్లకి పద్మకుమారి, పైనం ప్రభాకర్, బొమ్మల దేవదాసు, గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, రామాంజనేయులు, గ్రామ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, నైనాల శ్రీనివాసరావు, కోటు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ యాదాల వెంకట్రావు, దేవరపల్లి గోపికృష్ణారెడ్డి, నైనాల శేఖర్, పందిటి అయ్యప్ప, గద్దె జాలయ్య, బత్తుల వెంకటసుబ్బయ్య, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు...

మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో సుమారుగా 20 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరి పార్టీ కండువాలు వేసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు వారికి నచ్చి పార్టీలో చేరుతున్నట్లుగా తెలిపారు. వారందరికీ మంత్రి మేరుగు నాగార్జున పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి సారథ్యంలో పార్టీలో చేరడంపై మంత్రి వాకా కోటిరెడ్డిని అభినందించారు. వెంగంశెట్టి శ్రీకాంత్, నైనాల లక్ష్మయ్య, షణ్ముఖరావు, వాకా అజిత్‌రెడ్డి, దారా లక్ష్మయ్య, వారి బంధువుల కుటుంబాలు, తాబేటి ఇసాక్, వారి బంధువుల కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి చేరాయి.

లా అండ్ ఆర్డర్ తప్పక పాటించాలి

- డీఎస్పీ కిషోర్‌బాబు



సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ, పోలీసు అధికారులు

ఒంగోలు అర్బన్: ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమాలలో లా అండ్ ఆర్డర్ తూ.చా. తప్పకుండా పాటించాలని డీఎస్పీ కిషోర్ కుమార్ సూచించారు. సోమవారం ఒంగోలు ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ జి.వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ, డీఎస్‌పీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలని, విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించరాదని అన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియపై పూర్తి నిఘా ఉంటుందన్నారు. ఎవరూ నిబంధనలు ఉల్లఘించి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. ఓటర్లను భయభ్రాంతులు చేయడం వంటి చర్యలు చేయకూడదన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, అందుకు రాజకీయ పార్టీలు నిబంధనలు తప్పక పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఓఎంసీ కమిషనర్ జశ్వంత్‌రావు, ఉప కమిషనర్ రవీంద్ర, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీటీ శ్రీదేవి, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతి కుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, అనిల్, రాజశేఖర్, రమేష్, యర్రయ్య, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పౌరాణిక పాత్రలే పునర్జీవాన్నిచ్చాయి

- సినీ హీరో సుమన్



సినీ హీరో సుమన్‌ను సత్కరిస్తున్న అభిమానులు

ఒంగోలు మెట్రో: ప్రజలంతా కులమతాలకు అతీతంగా, భారతీయులమన్న భావనతో సమైక్యంగా ఉండాలని సినీ హీరో సుమన్ ఆకాంక్షించారు. రామనగర్‌లోని బీకే ఎన్‌క్లేవ్‌లో ప్రముఖ ప్రాణిక్ హీలర్ కొణిజేటి రోశయ్య నివాసానికి వచ్చిన సుమన్‌ను పలువురు ప్రముఖులు, అభిమానులు కలిశారు. సుమన్ మాట్లాడుతూ.. 1978లో తమిళంలో హీరోగా అరంగేట్రం చేసిన తాను స్వయం కృషితో ఇప్పటి వరకు పది భాషల్లో 800 చిత్రాల్లో నటించినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన సంచలన సినీ దర్శకుడు టి.కృష్ణ నేటి భారతం చిత్రంతో తనకు హీరోగా సుస్థిర స్థానాన్ని తెలుగు చిత్ర సీమలో అందించారని గుర్తు చేసుకున్నారు. పౌరాణిక పాత్రలు తనకు పునర్జీవాన్ని ఇచ్చాయన్నారు. తన అభివృద్ధికి తోడ్పాటు అందించిన అభిమానులకు, దర్శనిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలు తనకు ఇష్టమైన ప్రాంతమని తన అభిమానులు ఎప్పుడు ఆహ్వానించినా ఈ ప్రాంతానికి రావడానికి ఆసక్తి చూపిస్తానన్నారు. ప్రముఖ క్రిస్టల్ హీలర్ కొణిజేటి రోశయ్య, సులోచన, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, నూకతోటి శరత్, ముస్లిం రచయితల సంఘ కార్యదర్శి హుమాయూన్ బాషా, రాజా దివ్య తదితరులు ఘనంగా హీరో సుమన్‌ను సత్కరించారు.

వలంటీర్లపై నిందలు బాధాకరం



భాగ్యనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి



అన్నవరప్పాడులో ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య

- పార్టీలకు అతీతంగా సేవలందించిన ఘనత వారిది
- వారు అందించే పెన్షన్లు కులమతాలకు అతీతం
- ఒంగోలు 19, 15 డివిజన్లలో బాలినేని శచీదేవి, శ్రీకావ్య ఇంటింటి ప్రచారం

ఒంగోలు: వలంటీర్ల సేవలు భేష్ అని, అవి ఎంతో మంది నిస్సహాయులకు ఆసరాగా నిలిచాయని, అటువంటి వారికి రాజకీయాన్ని ఆపాదించి వారి సేవలపై నిందలు వేయడం బాధాకరమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి సతీమణి బాలినేని శచీదేవి అన్నారు. మహిళలతో మమేకం-స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ఒంగోలు 19, 15 డివిజన్లలో బాలినేని శచీదేవి, శ్రీకావ్య వేర్వేరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లోని వారిని ఆప్యాయంగా పలకరించి పథకాలు అందుతున్నాయా..సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంట్లో పథకాలు పొందిన లబ్ధిదారులు బాలినేని శచీదేవి, శ్రీకావ్యలను ఆత్మీయంగా ఆహ్వానించారు. గతంలో చంద్రబాబు పెన్షన్ల పంపిణీకి అవలంబించిన విధానానికి, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పెన్షన్లు అందుకుంటున్న విధానానికి ఎంతో వ్యత్యాసం ఉందని ప్రజలు స్వయంగా తెలిపారు. నేడు పేద ప్రజల గుండె చప్పుడుగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. వలంటీర్లు కేవలం పెన్షన్ల పంపిణీ ఒక్కటే కాకుండా అనేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. వలంటీర్లకు రాజకీయం అంటగట్టడం, వారిపై నిందలు వేయడం సరికాదని అన్నారు. వాస్తవాన్ని పరిశీలించి వలంటీర్ల వల్ల పేద ప్రజానీకానికి కలిగే ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ఎన్నికల కమిషన్ పునరాలోచించి వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులకు పెన్షన్ల పంపిణీ ప్రక్రియపై జారీచేసిన ఆంక్షలను సడలించాలని నిస్సహాయుల తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాలినేని శచీదేవి వెంట 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు (చిన్నారి), డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ఇన్‌చార్జి నరాల రమణారెడ్డి, రవిచంద్రకుమార్, నరేష్, గణేష్, పవన్, అనీల్, కోటి, చలపతి, జిలానీబాషా, మీరా మొహమ్మదీన్, సుజాత, పద్మ, శశికళ, బాల, సరస్ తదితరులు పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో బాలినేని శ్రీకావ్య ఇంటింటి ప్రచారం చేపడుతుండగా ఒక మహిళ తన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇటీవల టీడీపీ వాళ్లు ఒక తోపుడు బండి ఇచ్చారని, అయితే, తన కొడుకు వైఎస్సార్ సీపీలో తిరుగుతున్నాడంటూ ఇచ్చిన బండిని కూడా లాక్కెళ్లారని వాపోయింది. బాలినేని శ్రీకావ్య మాట్లాడుతూ పేద ప్రజల జీవితాలతో ఎట్టి పరిస్థితులలోనూ చెలగాటం ఆడరాదన్నారు. తప్పకుండా పేదలకు అండగా ఉంటామని, ఎన్నికల కోడ్ ముగియగానే ఇటువంటి వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ప్రచారానికి సంబంధించి లభిస్తున్న ఆదరణ అద్వితీయంగా ఉందని, ప్రతి ఇంట్లో జగనన్న స్టార్ క్యాంపెయినర్లకు లెక్కలేదని అన్నారు. 15వ డివిజన్‌లో కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ ఆధ్వర్యంలో ఇప్పటికే రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వలంటీర్లపై ఆంక్షలు విధించేలా చేసి పెన్షనర్లను ఇబ్బంది పెట్టిన టీడీపీ నాయకులు మళ్లీ నేడు ఉపశమనం మాటలు మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ప్రజలు తప్పకుండా వారికి బుద్ధి చెప్పి విశ్వసనీయతకు పట్టం కట్టిన వాసన్నను గెలిపించాలని కోరారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు ఆనం శ్రీనివాసరెడ్డి, నాయకులు చైతన్య, ఆత్మకూరు శేషమ్మ, గార్లగుంట రమ, ముత్యాల నాగలక్ష్మి, ఒరుపల్లి మహాలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, గుడె పద్మశ్రీ, యల్లకూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పేర్నమిట్ట ప్రీమియర్ క్రికెట్ పోటీలు

సంతనూతలపాడు (చీమకుర్తి): మండలంలోని పేర్నమిట్ట పరిధిలో వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పేర్నమిట్ట ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. సంతనూతలపాడు మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి పాల్గొని విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి సాధించిన ఏఆర్11 జట్టుకు రూ.20 వేలను వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి అందించగా, రెండో స్థానంలో నిలిచిన వీవీఆర్ 11 జట్టుకు రూ.15 వేలను హిల్‌సిటీ, తృతీయ స్థానంలో నిలిచిన కేఎంసీసీ జట్టుకు రూ.10 వేలను బలిజేపల్లి మల్లికార్జున రెడ్డి అందజేశారు. అనంతరం యువతనుద్దేశించి వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించాలని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. యువత మాట్లాడుతూ తమను ఎంతగానో ప్రోత్సహిస్తున్న వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మన్నం శ్రీనివాసరెడ్డి, బండి శ్యాంసుందరరెడ్డి, కంది రాజశేఖరరెడ్డి, తొండపరెడ్డి మహేష్‌రెడ్డి, మచ్చా మురళీకృష్ణా రెడ్డి, రేవూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కవిసమ్మేళన కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కళామిత్రమండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం పది గంటలకు స్థానిక రాజాపానగల్ రోడ్డులో గల గౌతమ్ మోడల్ స్కూల్ ఆవరణలో కవిసమ్మేళనాన్ని కళామిత్రమండలి (తెలుగు లోగిలి), నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఉభయ సంస్థల అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం సాయంత్రం ఆరు గంటలకు హౌసింగ్ బోర్డుకాలనీ నరసం కార్యాలయంలో నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భాన్ని పురస్కరించుకుని జరిగే కవిసమ్మేళనంలో సుమారు నలభై మంది కవులు పాల్గొని కవితా గానం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళామిత్రమండలి జాతీయ కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, యు.వి.రత్నం, యం.సూర్యకుమారి, యువ కవయిత్రి బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాలి

కొత్తపట్నం: కొత్తపట్నం గ్రామం రెడ్డిపాలెం సబ్‌సెంటర్ స్థలంలో ఆక్రమణలు తొలగించి సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ హేమంత్‌కుమార్, డాక్టర్ వైష్ణవిలకు సోమవారం స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 1969లో సర్వే నంబర్ 1429బీలో సబ్‌సెంటర్‌కు 10 సెంట్ల స్థలాన్ని కేటాయించి జిల్లా మెడికల్ ఆఫీసర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయటం జరిగిందన్నారు. కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకుని కట్టడాలు నిర్మిస్తున్నారని, వాటిని అడ్డుకుని బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తంబి కాంతారావు, పురిణి శ్రీనివాసులు, గౌరవరపు శివాజీ, నక్కన కోటిరెడ్డి, తంబి నరసింహరావు, తంబి వెంకటేశ్వర్లు, మోటుపల్లి బాబు, కోడూరి బ్రహ్మరెడ్డి, మరపాల సుధాకర్‌రెడ్డి, బేల్దారి నాగరాజు, సూరి బాబు, పురిణి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.